

స్వచ్ఛభారత్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు స్వచ్ఛభారత్ అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతలో ప్రజలంతా భాగస్వాములు కావాలని అన్నారు. తొలుత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ విప్ పోతంశెట్టి వరప్రసాద్, కౌన్సిల్ సభ్యులు చిట్టూరి సతీష్, కొవ్వాడ బేబీ అప్పన్నబాబు, మొండి భవాని మురళి, శెట్టి కల్యాణి, కమిషనర్ టి.రామ్ కుమార్, మేనేజర్ కనకరాజు, వైసిపి పట్టణ అధ్యక్షులు ముమ్మిడివరపు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ రాణి తదితరులు

టెన్త్ పరీక్షల నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ లు పదో తరగతి పరీక్షల నిర్వహణ సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు సమన్వయ కమిటీ సభ్యులతో బుధవారం సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కమిటీ సభ్యులతో మాట్లాడుతూ విద్యార్థులకు మొట్ట మొదటి మైలురాయిగా నిలవనున్న పదవ తరగతిపబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని సూచించారు. పబ్లిక్ పరీక్షలు నిర్వహణకై పటిష్ట మైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎటువంటి మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజ్ వంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన ఏర్పాట్లు మధ్య నిర్వహించాలన్నారు. జిల్లాలో 374 ఉన్నత పాఠశాలలో చెందిన 10వ తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల నిర్వహణ కొరకు 111 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. వీటిలో 60 బి క్లాసు, 51 సి క్లాసు పరీక్షా కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 20,967 మంది విద్యార్థినీ, విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఏప్రిల్ 18వ తేదీ వరకు పరీక్షలు ఉదయం 9:30 నుంచి 12:45 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. ఆర్టీసీ వారు దూర ప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాలకు సంబంధించిన ఆయా రూట్లలో బస్ సర్వీసులు నడపాలన్నారు. పబ్లిక్ పరీక్షలు రాసే పదో తరగతి విద్యార్థులు హాల్ టికెట్టు చూపి ఉచితంగా బస్సుల్లో ప్రయాణించ వచ్చునన్నారు. పోలీసు శాఖ వారు ప్రశ్నాపత్రాల భద్రత, ప్రశ్నాపత్రాలు జవాబు పత్రాలు రవాణాలో స్కాడింగ్, శాంతి భద్రతల పరిరక్షణకై పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల నియమించాలన్నారు. బందోబస్తు నడుమ పరీక్షా కేంద్రాలకు తరలింపు, పరీక్షల అనంతరం జవాబు పత్రాలను క్లోజ్డ్ వాహనం లో పోస్టల్ సూపరింటెండెంట్ వారి కస్టడీకి తరలించే ఏర్పాట్లలో పోలీస్ యంత్రాంగం విద్యాశాఖ అధికారు లకు సహకరించాలని కోరారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణ, జిరాక్స్ కేంద్రాలను పరీక్షా సమయా నికి ఒక గంట ముందుగా మూసి వేయించాలని సూచించారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్లు, విద్యా రెవెన్యూ పోలీస్ అధికారులతోను అదేవిధంగా సిట్టింగ్ స్క్వాడ్లు నియమించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఎటువంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అనుమతించరాదన్నారు. పరీక్ష సమయానికి అభ్యర్థులు ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి హాజరు కావాలన్నారు. పరీక్షా సమయమైన తొమ్మిదిన్నర గంటలకు ఒక నిమిషం ఆలస్యంగా వచ్చిన ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులను పరీక్ష కేంద్రాల లోపలికి అనుమతించరని ఆయన స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాలు రవాణాకై 10 రూట్లను ఏర్పాటు చేశారన్నారు. ఆశా వర్కర్లు బెటర్‌స్క్రీనింగ్ వర్కర్లకు పరీక్ష నిర్వహణకు సంబంధించిన బాధ్యతలు అప్పగించరాదని, రెగ్యులర్ ఉద్యోగులు మాత్రమే బాధ్యతలు అప్పగించి నిశితంగా పర్యవేక్షణ చేయాలన్నారు.పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని ఆదేశించారు. ట్రాన్స్‌కో అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. మున్సిపల్ గ్రామపంచాయతీ అధికారులు పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, వైద్య ఆరోగ్యశాఖ పరీక్షా కేంద్రాల వద్ద ఒఆర్ఎస్ ద్రావణంతో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్లు తో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమల కుమారి, డిటిఒ అశోక్ ప్రతాపరావు, డిఎంహెచ్ఒ ఎం.దుర్గారావు దొర, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ నాగేశ్వరరావు, ట్రాన్స్‌కో ఇఇ రవికుమార్, పోస్టల్ అధికారులు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పట్టణాభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

సుస్థిర అభివృద్ధి దిశగా రామచంద్రపురం పురపాలక సంఘాన్ని తీర్చిదిద్దే విధంగా ప్రణాళికలు రూపొందించామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ అన్నారు. ఆయన బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. పట్టణంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి చేపట్టిన చర్యల్లో భాగంగా రెండు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పట్టణంలోని అన్ని కూడళ్లలో రోడ్డు పనులు చేపట్టారన్నారు. పూర్తయిన రోడ్లను ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభిస్తారన్నారు. అదేవిధంగా పట్టణంలోని డ్రెయినేజీల అభివృద్ధికి రూ.15 కోట్లతో దశలవారీగా పనులు చేపట్టే విధంగాప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించా మన్నారు. పట్టణానికి ప్రధాన సమస్యగా డంపింగ్ యార్డ్ ఉందని దీనికోసం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. త్వరలో పట్టణంలోని చెరువుగట్టు ప్రాంతం వద్ద రైతు బజార్ తో పాటు 33 షాపులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కావలసిన పనులుచేపట్టనున్నట్లు మంత్రి కౌన్సిల్ దృష్టికి తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గాధం శెట్టి శ్రీదేవి అధ్యక్షతన పలు అంశాలపై చర్చించి ఆమోదింప చేశారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

పేదలకు మాత్రమే టిడ్కో ఇళ్లు

ప్రజాశక్తి-మండపేట

టిడ్కో ఇళ్లు పేదవారికి మాత్రమేనని బినామీలు, అనర్హులను తొలగించాలని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు హాజరయ్యారు. అజెండాలోని 22వ అంశం చర్చకు వచ్చినపుడు పలువురు టిడిపి కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ మిగిలిన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఎప్పుడు ఇస్తారని, పొల్యూషన్ కారణంగా పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బురుగుంట చెరువు పార్కులో వాకింగ్ ట్రాక్ పాడై పార్కుకు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారంటూ తదితర సమస్యలు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. ఎంఎల్‌సి తోట మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సౌకర్యార్థం బోర్లు వేసి నీటి సరఫరా చేయడానికి రూ.30 లక్షలతో కార్యచరణ రూపొందించామన్నారు. సుమారు రెండు వేల మందికి ఇళ్లు కేటాయించగా ప్రస్తుతం టిడ్కో ప్లాట్‌ల సముదాయంలో 500 మంది మాత్రమే నివాస ఉంటున్నారన్నారు. కమిషనర్ రామ్‌కుమార్, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి తోట

సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఆలమూరు

వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించిందని కొత్తపేట ఎంఎల్‌ఎ, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తూరు ఎస్.జె.ఆర్ ఫంక్షన్ హాల్లో వైఎస్ఆర్ ఆసరా 3వ విడత కార్యక్రమం బుధవారం ఎంపిపి తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఎంఎల్‌ఎ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కొత్తపేట నియోజకవర్గంలో 6297 డ్వాక్రా సంఘాలకుగాను రూ.54,77,35,379లు మంజూరవ్వగా మండల పరిధిలోని 18 గ్రామాల్లో 1652 పొదుపు సంఘాల సభ్యులకు 15,00,65,728 చెక్కును అందజేశారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే చిర్ల మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మెరుగైన జీవనోపాధి కల్పన దిశగా మహిళలు ముందంజలో ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల వైసిసి కన్వీనర్ శ్రీనివాస్, జెడ్‌పిటిసి సభ్యులు తోరాటి సీతామహాలక్ష్మి, మాజీ ఎంపిపి తోరాటి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు నెక్కింటి వెంకట్రాయుడు, యనమదల నాగేశ్వరరావు, సర్పంచులు ఎన్.లావణ్య కుమార్ రాజా, ఏడిద సత్యశ్రీ మెహర్, కట్టా శ్రీనివాసు, ఎంపిడిఒ జాన్ లింకన్, ఎపిఎం ధనరాజు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యుదయమే ప్రభుత్వ లక్ష్యం

కపిలేశ్వరపురం మహిళాభ్యుదయమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. బుధవారం కపిలేశ్వరపురం మండలంలోని అంగరలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా మూడో విడత నగదు పంపిణి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఉద్దేశంతో ప్రభుత్వ రూ.కోట్లు మహిళలు ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. అంగర, పడమర ఖండ్రిక, నల్లూరు, వెదురుమూడి గ్రామాల్లో 497 డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.7,62,08,451 వైఎస్ఆర్ ఆసరా రుణమాఫీ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, జెడ్‌పిటిసి సభ్యుడు పుట్టపూడి సూర్యనారాయణ మూర్తి, సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, చుండ్రు చిట్టిబాబు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, ఎపిఎం అర్జున్, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరులో వైఎస్ఆర్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ జగ్గిరెడ్డి

పట్టణ కౌన్సిల్ సమావేశంలో వాగ్వాదం

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో అధికార పక్షం కౌన్సిలర్లకి మున్సిపల్ చైర్‌పర్సన్‌కి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తనకు తెలియకుండా అమలాపురం పట్టణంలో మంత్రి పేరిట పనులు పెట్టడం ఎంతవరకు సమంజసమంటూ మునిసిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి అధికార పక్ష కౌన్సిలర్లను ప్రశ్నించారు. దాంతో ఒక్కసారిగా చైర్‌పర్సన్‌పై వైసిపి కౌన్సిలర్లు వాగ్వివాదానికి దిగి పాలక పక్ష కౌన్సిలర్లు సమావేశ మందిరం నుంచి బయటకు వెళ్లిపోయారు. మహిళా చైర్ పర్సన్ ను అవమానపరిచి వైసిపి కౌన్సిలర్లు బయటకు వెళ్లిపోవడం ఎంతవరకు సమంజసం అంటూ జనసేన, టిడిపి కౌన్సిలర్లు పోడియాన్ని చుట్టుముట్టారు. ఈ సందర్భంలో సమావేశం నుంచి కమిషనర్ నాయుడు వెళ్లిపోయేందుకు ప్రయత్నం చేయగా జనసేన, టిడిపి కౌన్సిలర్లు అడ్డుకున్నారు. మునిసిపల్ సమావేశాన్ని గంట వాయిదా వేసి చైర్‌పర్సన్ రెడ్డి నాగేంద్ర మణి వాకౌట్ చేశారు.


పంపిణీ చేస్తున్న సర్పంచ్ సతీష్ కుమారి

టెన్త్ విద్యార్థులకు పరీక్షా కిట్ల అందజేత

ప్రజాశక్తి-రామచంద్రపురం

టెన్త్ విద్యార్థుల కు పరీక్షలకు అవసరం అయిన మెటీరియల్స్ ను వెంకటాయపాలెం సర్పంచ్ యాళ్లమిల్లి సతీష్ కుమారి బుధవారం అంద చేశారు. హై స్కూల్ లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ అందరూ పరీక్షలు బాగా రాసి హై స్కూల్ కు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.పదవతరగతి మంచి మార్కులు సాధిస్తే ఎన్నో అవకాశాలుఉంటాయని వివరించారు. ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్‌కు పరామర్శ

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలోని 2వ వార్డు సచివాలయ కన్వీనర్ జుత్తుక లీలావతి భర్త ఇటీవల మరణించారు. బుధవారం ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ఆ వార్డు కౌన్సిలర్ చిట్టూరి సతీష్ లు లీలావతి కుటుంబాన్ని పరామర్శించారు.


మాట్లాడుతున్న వెంకటరమణ

వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-అమలాపురం

వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాననిజిల్లా వైసిపి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు కాశి వెంకటరమణ అన్నారు. అమలాపురం కోనసీమ వికలాంగుల సంక్షేమ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో ఆయన బుధవారం సంఘ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం సంఘ సేవా కార్యక్రమాలు పరిశీలించారు. జిల్లా వికలాంగుల సంక్షేమ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు ఒంటెద్దు వెంకయ్యనాయుడు ఆదేశాల మేరకు దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు నాగవరపు పరశురాముడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వెంకటరమణకి ఈ సంఘం చేస్తున్న సేవలు వివరించారు. తదుపరి వెంకటరమణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ మాట్లాడుతూ నాకు ఈ పదవిని ఇచ్చిన సిఎం జగన్‌కు, ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్‌కు, వైసిపి రాష్ట్ర అధ్యక్షులు బందెల కిరణ్ కు కృతజ్ఞతలు తెలిపారు ఎల్లప్పుడూ ప్రతి ఒక్కరికి నేను అందుబాటులో ఉంటానని వికలాంగుల సంక్షేమ అభివృద్ధి కోసం పాటుపడతానని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల సంఘం గౌరవ అధ్యక్షులు ఒంటెద్దు వెంకయ్య నాయుడు, కోనసీమ వికలాంగుల సంక్షేమ సేవా సంఘ అధ్యక్షులు నాగవరపు పరశురాముడు, ఆంధ్రప్రదేశ్ వికలాంగుల మహా సంఘటన్ అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్, అమలాపురం పట్టణ వికలాంగుల సమైక్య అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, అయితాబత్తుల సురేష్, సత్య దుర్గ, బొంతు శ్రీనివాస్, సాధనాల విగ్నేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.


రావులపాలెంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇజ్రాయేల్

రాష్ట్రాభివృద్ధికి కృషి: ఎంఎల్‌సి ఇజ్రాయేల్

ప్రజాశక్తి-రావులపాలెం

రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయేల్ అన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో విజయం సాధించి తొలిసారిగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు విచ్చేసిన ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయేల్ కు కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట బాపట్ల ఎంపీ నందిగం సురేష్, డిసియమ్‌యస్ ఛైర్మన్ సాకా మణి కుమారి ప్రసన్నకుమార్, ఎంపిటిసి సభ్యుడు దొండపాటి వీర్రాజు, కొల్లి శాంసన్, నేకూరి రాజేష్ కుమార్, వంగలపూడి బాబురావు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట** జిల్లాకు తొలిసారిగా జిల్లాకు విచ్చేస్తున్న ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయేల్‌కు ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. పలువుర నాయకులు ఉన్నారు. **అంబాజీపేట** ఎంఎల్‌సి ఎన్నికలలో విజయం సాధించి తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన బొమ్మి ఇజ్రాయెల్ కు పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో అంబాజీపేట సెంటర్‌లో బుధవారం క్రెయిన్ సహాయంతో గజమాలతో అరుంధతి ఫాలోవర్స్, వైసిపి శ్రేణులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో పేరు కామేశ్వరరావు, ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, పినిపే శ్రీకాంత్, మండల అధ్యక్షులు వి. చిన్నబాబు, వైసిపిఇంచార్జ్ దొమ్మేటి సత్యమోహన్, చెల్లుబోయిన శీను తదితరులు పాల్గొన్నారు. పి. గన్నవరం సిఐ ప్రశాంత్, ఎస్ఐ చైతన్యకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. **అమలాపురం** ఎంఎల్‌సి బొమ్ము ఇజ్రాయేల్ కు అమలాపురంలో వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి - కొత్తపేట

సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్యసిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని అవిడి పిహెచ్‌సి కమిటీ చైర్మన్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు మార్గాన గంగాధర్ అన్నారు. అవిడి పిహెచ్‌సి నందు ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి సహకారంతో డిఎంహెచ్‌ఒ నిధులతో సుమారు రూ.నాలుగు లక్షల యాభై వేల ఖర్చుతో 63 వైద్య పరీక్షల నిమిత్తం ఎలక్ట్రోలైట్ యన్ లైసెర్, బయోకెమిస్ట్రీ యన్ లైసెర్, యూరిన్ యన్ లైసెర్ పరికరాలను గంగాధర్ బుధవారం వాటిని పరీక్షించి ప్రారంభించారు అనంతరం.జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమం లో అవిడి గ్రామ సర్పంచ్ రెడ్డి చంటి, మోడేకుర్రు గ్రామ సర్పంచ్ కూడిపూడి రామలక్ష్మి, డాక్టర్ పి.రవి కుమార్ , డాక్టర్ వి.ఇంద్ర భారతి రాయ్ ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

బాల బాలాజీ హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానం హుండీని బుధవారం లెక్కించారు. స్వామి వారి ఆదాయం 23 రోజులకు రూ.8,53,630, అన్నదానం హుండీ ద్వారా రూ.18,196 మొత్తం రూ.8,71,826 సమకూరినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకెటి. నాగ వరప్రసాద్ తెలిపారు. అమలాపురం దేవాదాయశాఖ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు, వానపల్లి పళ్ళాలమ్మ టెంపుల్ ఇఒ బొక్క వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో బుధవారం జరిగిన లెక్కింపు కార్యక్రమంలో ధర్మకర్త మండల చైర్మన్ చిట్టూరి రామకష్ణ, పిఎసిఎస్ చైర్మన్ గడ్డం కష్ణమూర్తి, మరియు ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


హుండీలను లెక్కిస్తున్న దృశ్యం

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బిజెపి

ప్రజాశక్తి - అంబాజీపేట

బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న తీరును ప్రజల గమనిస్తున్నారని పిసిసి సభ్యులు మాచవరం శ్రీమన్నారాయణ అన్నారు. అంబాజీపేట మండల శాఖ అధ్యక్షుడు నెల్లి వెంకటరమణ అధ్యక్షతన బుధవారం మండల కాంగ్రెస్ సమావేశం జరిగింది. ప్రధాన పదవిని తణాపాయంగా వదిలి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు, జైళ్లు, సస్పెన్షన్లతో రాహుల్ ని భయపెట్టలేరన్నారు. రాహుల్ గాంధీ కోసం దేశంలో కార్యకర్తలు అండగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ ఆరిఫ్, ములపర్తి మోహనరావు, మహమ్మద్ ఇస్మాయిల్, ఆదుర్తి నారాయణమూర్తి, కొల్లి సరోజిని, నేలపూడి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

31న విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ పరిధిలోని టౌన్ వన్ ఫీడర్ విద్యుత్తు లైన్లలో ట్రీ కటింగ్ చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 31న శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ బుధవారం తెలిపారు. పట్టణ పరిధిలో కష్ణ ప్రభాస్, ధర్మగుండం చెరువు, వల్లూరి వారి వీధి, రావులపేట, కష్ణ కల్యాణి నగర్, ఆలమూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి వృథాను అరికట్టాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

భావితరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటిని వృథా అరికట్టాలని సర్పంచ్ కడిమి చిన్నవరాజు సూచించారు. తాగునీటి వినియోగంపై ఉప్పలగుప్తం లో సర్పంచ్ చిన్నవరాజు అధ్యక్షతన బుధవారం జల్ జీవన్ మిషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి ఇంటిలోని ప్రతి వ్యక్తికి 55 లీటర్ల తాగు నీటిని కుళాయిల ద్వారా అందించడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నాయని నీటి విషయంలో తగు జాగ్రత్తలు పాటించకపోతే భావితరాలకి నీటి కోసం ఇబ్బందులు తప్పవని నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని జెజెఎం అమలాపురం కోఆర్డినేటర్ ఎం.రమేష్ అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిక్కిరెడ్డి రామకష్ణ, సచివాలయ సిబ్బంది, ఎఎన్ ఎం,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం


డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బుధవారం టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు.

మండపేట స్థానిక ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వాణి మహల్ సెంటర్లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి, అర్తమూరులో టిడిపి నాయకులు నల్లమిల్లి వీర్రెడ్డి ఆధ్వర్యంలో పెద్దనూతి సెంటర్ దగ్గర ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నేత కొవ్వూరి బాపిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, కార్యకర్తలు గుండు తాతరాజు, గనిశెట్టి రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.**ఆలమూరు** వాడ వాడల టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు నిర్వహించారు. మండలంలోని మోతుకూరులో టిడిపి నేతలు పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చుండ్రు శ్రీనివాస్, రాయుడు సుధాకర్, టిడిపి గ్రామ అధ్యక్షుడు దాయిని నాగేశ్వరరావు, ఎడ్లపల్లి సత్యనారాయణ, చుండ్రు వీర్రాజు, నూనె శివ తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట** కొత్తపేట టిడిపి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ పతాకాన్ని మండల పార్టీ అధ్యక్షులు కంఠంశెట్టి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. **కపిలేశ్వరపురం** మండలంలోని పలు గ్రామాల్లో టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. **అయినవిల్లి** టిడిపి ఆవిర్భావ దినోత్సవం శానపల్లిలంకలో మండలపార్టీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాసురావు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, రాష్ట్ర టిడిపి హెచ్ ఆర్.డి సభ్యుడు దళితరత్న నేదునూరి వీర్రాజు, రాష్ట్ర టిడిపి విబిన్న ప్రతిబావంతుల కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి కళ్ళేపల్లి వెంకట సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.**రావులపాలెం** టిడిపి కార్యాలయం వద్ద జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో మండల పార్టీ అధ్యక్షులు గుత్తుల పట్టాభి రామారావు పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సతీష్ రాజు, సయ్యపరాజు రామకృష్ణంరాజు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని టిడిపి మండల అధ్యక్షుదు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉప్పలగుప్తంలో పార్టీ స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి గొల్లవిల్లి సెంటర్ లో ఎన్ టి ఆర్ నిలవెత్తు విగ్రహానికి పూలమాలలు వేశారు. గోపవరంలో మాజీ ఎంపి ఎజెవి బుచ్చిమహేశ్వరరావు, చల్లపల్లిలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మకాయల చెల్లయ్య నాయుడుల ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. **మామిడికుదురు(పి.గన్నవరం)** పి గన్నవరం మండల టిడిపి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కేకు కట్ చేసి సీనియర్ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో పి.గన్నవరం సర్పంచ్ బొండాడ నాగమణ, మండల టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.**మామిడికుదురు** సెంటర్లో మండల శాఖ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సీనియర్ నాయకులను, కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు. **అంబాజీపేట** సెంటర్లో మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు డి.శ్రీను రాజు, గుడాల ఫణి ల ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ నిర్వహించారు కార్యక్రమంలో సీనియర్ నాయకులు వక్కలంక బుల్లియ్య, డివివి సత్యనారాయణ, బొంతు పెదబాబు, గణపతి వీరరాఘవులు, గంగుమళ్ళ వీరభద్రరావు, రమణ రాము బాల విజయరావు తదితరులు పాల్గొన్నారు. **కాట్రేనికోన:** చెయ్యేరు అగ్రహారంలో జరిగిన వేడుకల్లో ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చెయ్యేరు సర్పంచ్ చెల్లి సురేష్, గెద్దనపల్లి సర్పంచ్ డి.సీతారామ కష్ణం రాజు, ఇసుక పట్ల వెంకటేశ్వరరావు, మంతెన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల


అంబాజీపేట సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో టిడిపి శ్రేణులు

కార్టూ 'నిజం'



మనం చెప్పుకుంటేనే దిక్కు లేదు..!!

నేరాలు ఘోరాలు

వేర్వేరు ఘటనల్లో గోదావరిలో దూకి ఇద్దరు ఆత్మహత్య

ప్రజాశక్తి - యానాం

వేరు వేరు ఘటనలలో యానాం గౌతమీగోదావరిలో దూకి ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారని బుధవారం ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. మొదటి ఘటనలో ఈ నెల 27న యానాం ఫెర్రీ ఏరియాలోని కెవిఆర్ నగర్‌కు చెందిన పోతాబత్తుల మహేష్ (21) జీవితంపై విరక్తితో యానాం-ఎదుర్లంక బాలయోగి వారధిపైనుంచి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఈ నేపథ్యంలో అతని కోసం గత మూడురోజులుగా గోదావరిలో గాలించగా బుధవారం మృతదేహం లభ్యమయ్యిందన్నారు. అదేవిధంగా గండేపల్లి మండలం మురారికి చెందిన కాకర్ల వీరశేఖరరావు (29) గత కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతూ బుధవారం గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మృతదేహాన్ని ఎన్ఎస్ఐవి జెట్టి వద్ద కనుగొన్నామన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం యానాం జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైల్వే ట్రాక్ పై గుర్తుతెలియని వృద్ధుని మృతదేహం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట- జి.మెడపాడు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వృద్ధుడి (70) మృతదేహం లభ్యమైనట్టు స్థానిక రైల్వే పోలీసులు తెలిపారు. విజయవాడ వైపు వెళ్లే రైల్వే ట్రాక్ మధ్యలో గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం పడి ఉన్నట్టు రైల్వే కీమేన్ సమాచారంతో స్టేషన్ మాస్టర్ శేష కృష్ణ కాంత్ ఆర్‌పిఎఫ్ పోలీసులకు సమాచారాన్ని అందించారు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మతుడు 5.4 అడుగులు ఎత్తు కలిగి, చామనచాయ రంగుతో ఉన్నాడు. తెలుపు రంగు పూర్తిచేతుల చొక్కా, తెలుపు రంగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతుని తాలుకు బంధువులు ఎవరైనా ఉంటే మృతదేహం వివరాలు కోసం సామర్లకోట రైల్వే ఆర్‌పిఎఫ్ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఎస్ఐ బి లోవరాజు తెలిపారు. ఈ మేరకు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి ఎస్ఐ లోవరాజు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి తుప్పల్లోకి దూసుకెళ్లిన బస్సు

- ప్రయాణికులు క్షేమం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండల పరిధిలోని కట్టమూరు రోడ్డు సమీపంలో ఏలేశ్వరం నుండి కాకినాడ వెళుతున్న ఏలేశ్వరం డిపో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పక్కనే ఉన్న తుప్పల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంతో బస్సులో ఉన్న ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎవరికీ ఏ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సుకు తాళ్లు కట్టి ట్రాక్టర్లతో రోడ్డు పైకి తీసుకువచ్చారు. పెద్దాపురం-జగ్గంపేట రహదారి గోతులతో అధ్వానంగా ఉండటంతో బస్సు అదుపుతప్పి ఉంటుందని భావిస్తున్నారు.



పట్టుబడిన టేకు కలప వ్యాను

రూ.85 వేల విలువైన కలప స్వాధీనం

ప్రజాశక్తి -గోకవరం

అనుమతులు లేకుండా తరలిస్తున్న టేకు కలపను మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు దేవీపట్నం మండలం ఇందుకూరు రేంజ్ అధికారి వి దుర్గాకుమార్ బాబు తెలిపారు వివరాలు ఇలా ఉన్నాయి. దేవీపట్నం మండలం ఏనుగుల గూడెం గ్రామానికి చెందిన బి.నాగరాజు తన పొలంలో ఉన్న టేకు కలపను ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా 24 టేకు దుంగలను (విలువ రూ.85,138) అశోక్ లైలాండ్ మినీ వాహనంలో తరలిస్తున్నాడు. వీరవరం గ్రామంలో అటవీ సెక్షన్ అధికారి ఎస్.కష్ణ బీట్ అధికారులు బి.రాజ్ కుమార్, ఎన్.వెంకటరమణశ్రీను ఈ కలపను పట్టుకున్నట్లు తెలిపారు. మండల కేంద్రమైన గోకవరం ఇందిరమ్మ కాలనీకి చెందిన డ్రైవర్ అశోక్, టేకు కలప యజమాని నాగరాజు పై కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి దుర్గాకుమార్ బాబు తెలిపారు.

శ్మశానవాటికను ఆక్రమించారని ఆందోళన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎన్.కొత్తపల్లిలో ఒల్డ్ అయినాపురం మురుగ కాలువ గట్టు న ఉన్న శ్మశాన వాటికను గ్రామానికి చెందిన రైతు ఆక్రమించాడని ఆ గ్రామస్తులు బుధవారం ఆందోళనకు దిగారు. ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున మహిళలతో కలిసి రాస్తారోకో చేసే ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న జెసి ధ్యాన చంద్ర, తహశీల్దార్ జె. వెంకటేశ్వరి ఆందోళన కారుల దగ్గరకు వచ్చారు. తమ గ్రామంలోని 11 సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు చాలాకాలంగా మురుగు కాలువ గట్టును శ్మశాన వాటికగా వాడుకుంటున్నామని అన్నారు. అయితే శ్మశాన వాటిక గత కొంతకాలంగా ఆక్రమణలకు గురవుతుందంటూ ఆందోళన చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఆక్రమణలకు గురవడంతో స్థలం లేక సమాధుల పైనే మతదేహాలను పూడ్చి పెట్టవలసి వస్తుందని గ్రామస్తులు జెసికి వివరించారు. శ్మశాన వాటికగా వాడుకుంటున్న మురుగకాలువ గట్టును సర్వే చేయించి గ్రామంలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలం ఉంటే దానిని శ్మశాన వాటికకు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని జెసి ధ్యాన చంద్ర అన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



సామర్లకోటలో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - సామర్లకోట

మనం నివసించే ప్రాంతం ఏదైనా దానిని పరిశుభ్రంగా ఉంచేలా చూసు కోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఎక్కువ కాలం జీవించగలం గుతామని రాష్ట్ర కార్మిక సంఘ నాయకులు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి అన్నారు. సామర్లకోటలో మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛత ర్యాలీని వారు ప్రారంభించారు. పిఠాపురం మెయిన్ రోడ్డు మీదుగా బల్ల మార్కెట్, గాంధీ బొమ్మ సెంటర్ నుంచి రింగ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ స్వచ్ఛత ప్రతిజ్ఞ సిబ్బంది ప్రజలతో చెప్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస, మున్సిపల్ కౌన్సిలర్లు పిట్టా సత్యనారాయణ, యార్లగడ్డ జగదీష్, పాలిక కుసుమ చంటిబాబు, రెడ్డి లోవకుమారి, గంగిరెడ్డి కృష్ణమూర్తి, పిట్లిబాని శ్రీనివాసరావు, నక్కా శ్రీనివాసరావు, మున్సిపల్, పారిశుద్ధ్య సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** మున్సిపల్ సెంటర్లో స్వచ్ఛత ర్యాలీని చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి లు ప్రారంభించారు. ఈ ర్యాలీ మెయిన్ రోడ్ మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె సురేంద్ర, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు, మెప్మా సీఎంఎం వెంకటలక్ష్మి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



పెద్దాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు, డ్వాక్రా మహిళలు

హోప్ ఐలాండ్‌లో మౌలిక సదుపాయాలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి - కాకినాడ

హెూప్ ఐలాండ్ మత్స్యకారులకు, అక్కడ నివాసం ఉంటున్న ప్రజానికానికి మౌలిక వసతుల కల్పనలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరు కార్యాలయంలో కలెక్టర్ కతికా శుక్లా మత్స్య, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, పోర్ట్ శాఖల అధికారులతో సమీక్షించారు. తాళ్ళరేవు మండలం చిన్న బొడ్డు వెంకటయ్య పాలెం గ్రామ పరిధిలో ఉన్న హెూప్ ఐలాండ్‌లో నివసిస్తున్న మత్స్యకారులు ఇతర ప్రజానీకానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనపై వివిధ శాఖలతో కూడిన అధికారుల బందం ఇప్పటికే హెూప్ ఐలాండ్ ప్రాంతాన్ని పర్యటించి నివేదికలు సిద్ధం చేసినట్టు కలెక్టర్ తెలిపారు. మత్స్యకారులకు అవసరమైన జెట్టి నిర్మాణం, తాగునీరు సదుపాయం, విద్యా, అంగన్‌వాడీ భవనాల మరమ్మతులకు అవసరమైన పూర్తిస్థాయి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీపీవో పీ.త్రినాథ్, జిల్లా మంత్స్యశాఖ అధికారి పి.సత్యనారాయణ, ఎఫ్‌డిఒ జీ.గోపి, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల ఎస్ఇలు పోర్ట్ అధికారులు పాల్గొన్నారు.

భర్తను చంపిన కేసులో భార్యకు, ఆమె ప్రియునికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - కాకినాడ క్రైమ్

ప్రియుడితో కలిసి భర్తను చంపిన కేసులో భార్యకు ఆమె ప్రియుడికి జీవిత ఖైదు విధిస్తూ కాకినాడ మూడో ఆదనపు జిల్లా కోర్ట్ జడ్జి పి.కమలాదేవి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... కాకినాడ జగన్నాధపురానికి చెందిన మద్దూరు శామ్యూల్, విజయ్ కుమారి భార్యాభర్తలు. రాజమండ్రికి చెందిన ఈ. గోపితో విజయ్ కుమారికి వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం భర్త శామ్యూల్‌కు తెలిసి అడ్డుపడేవాడు. దీంతో భర్తను అడ్డు తొలగించుకోవాలని ఉద్దేశంతో 2013వ సంవత్సరం జూన్ నెల 20వ తేదీన భర్త శామ్యూల్ జగన్నాధపురం లోని ఇంట్లో .. భార్య విజయ్ కుమారి, ఆమె ప్రియుడు గోపి తో కలిసి శామ్యూల్‌కు పాలల్లో నిద్ర మాత్రలు కలిపి ఇచ్చింది. నిద్రలో ఉండగా స్కిప్పింగ్ వైరుతో గొంతు బిగించి ఇద్దరూ కలిసి హత్య చేశారు. వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో ముద్దాయిలు ఇద్దరికి జీవిత ఖైదు, 20, 000 రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఎపిపి కె.ఆదిత్య కుమార్ వాదించగా. కాకినాడ డిఎస్‌పి మురళీకష్ణ రెడ్డి, వన్ టౌన్ సిఐ కృష్ణ కేసును పర్యవేక్షించి సాక్షులను ప్రవేశపెట్టారు.

శ్రీరామనవమి సెలవు అయినా పన్నులు కట్టొచ్చు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆర్థిక సంవత్సరం ముగింపునేపద్యంలో గురువారం శ్రీరామనవమి సెలవు అయినప్పటికీ పన్నులు స్వీకరిస్తామని కార్పొరేషన్ ఎడిసి సిహెచ్.నాగనరసింహారావు తెలిపారు. పన్నులు చెల్లింపునకు రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నందున కాకినాడలోని అన్ని సచివాల యాల్లోను ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను, కుళాయి పన్నులను స్వీకరించేలా ఏర్పాటు చేశామన్నారు. సచివాలయాలతోపాటు ప్రస్తుత నగరపాలక సంస్థ కార్యాలయం(స్త్రీ శక్తి భవన్), సినిమా రోడ్డులోని పాత కార్పొరేషన్ భవనంలోని కౌంటర్లలో కూడా పన్నులు చెల్లించవచ్చునన్నారు. వడ్డీ, అపరాధ రుసుము లేకుండా ఈ నెల31వ తేదీలోపుగా పన్నులు చెల్లించాలని ఆయన పన్ను చెల్లింపుదారులను కోరారు.



శిక్షణ పూర్తి చేసుకున్న ఆరోబ్యాచ్ గ్రామాల ప్రతినిధులతో ఎంపిడిఒ శ్రీలలిత

ముగిసిన స్వచ్ఛ సంకల్ప శిక్షణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని ఉండూరు చెత్తనుండి సంపద తయారీ కేంద్రంలో జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా తడి-పొడి చెత్త సేకరణ, వర్మీ కంపోస్టు తయారీ, స్వచ్ఛ గ్రామాల నిర్వహణ అంశాలపై కిర్లంపూడి మండలం జగపతినగరం, గోనేడ, గండేపల్లి, రామకృష్ణాపురం, వీరవరం గ్రామాల సర్పంచిలు, పంచాయితీల సిబ్బంది ఎంపిడిఒ డి శ్రీలలిత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది, క్లాప్ మిత్రలు, సీనియర్ వైసీపీ నాయకుడు ఎలిశెట్టి నరేష్, సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, ఉప సర్పంచి కొప్పరెడ్డి రాధాకృష్ణ, కార్యదర్శి కుమార్‌రాజా పాల్గొన్నారు.

కన్నతల్లిలా పోషణ అందించాలి



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఎంపిపి సునీత, సిడిపిఓ మాధవి

ప్రజాశక్తి - తాళ్లరేవు

అంగన్‌వాడీల్లో కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు కన్నతల్లిల పోషణ అందించాలని ఎంపిపి రాయుడు సునీత అన్నారు. తాళ్లరేవు సిడిపిఓ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఓ మాధవి మాట్లాడుతూ 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం గా గుర్తించారని అందువల్ల చిరుధాన్యాల్లో ఉండే పోషక విలువలు ప్రతి తల్లి తెలుసుకుని చిన్నారులకు అందించాలన్నారు.. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో చేసిన పలు రకాల వంటకాలను అంగన్వాడీలు ప్రదర్శించారు. పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, కుడిపూడి శివన్నారాయణ, రచ్చ ముత్యాలరావు, నంది కోళ్ల శ్రీమన్నారాయణ, చిట్టూరి చలపతి తాళ్ళరేవు సెక్టర్ అంగన్‌వాడీలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- యు. కొత్తపల్లి

ఇటీవల మరణించిన ఉప్పాడ నాయకుల కాలనీకి చెందిన మైల అప్పన్న కుటుంబాన్ని మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాస్ పరామర్శించి రూ.3000 ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట ఎంపిటిసిలు గోగు బుజ్జి, బొందు రాంబాబు, చొక్కా సింగన్న, మెరుగు ఎల్లాజీ, కంబాల లక్ష్మణ్ గ్రామ పెద్దలు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కారే శ్రీనివాస్

పిల్లలను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దండి

ప్రజాశక్తి - పెద్దాపురం

తల్లిదండ్రులు తమ పిల్లలను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దినప్పుడే వారిలో వృద్ధుల పట్ల గౌరవం పెరుగుతుందని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షులు బి సూర్యనారాయణ మూర్తి అన్నారు. బుధవారం స్థానిక రామారావు పేటలో జరిగిన వృద్ధుల సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుండి పిల్లలకు మంచి, మానవత్వం అవగాహన పెంచాల న్నారు. తమ తదనంతరం మాత్రమే ఆస్తులు వారికి చెందేలా జాగ్రత్త వహించాలన్నారు. సమావేశంలో ఎంవివి చలపతిరావు, కె.సుధాకర్, ఎం.భాస్కరరావు, జివిఆర్ చౌదరి, సిమ్మ గోవిందు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణమూర్తి

యానాం వార్తలు

యానాం సమస్యలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - యానాం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

యానాం నియోజకవర్గ సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. బుధవారం పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాల్లో ఆయన ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ విద్యాశాఖలో తక్కువ వేతనాలతో పనిచేస్తున్న పారాటీచర్ల వేతనాలు పెంచాలని కోరారు. అదేవిధంగా అంగన్‌వాడీ హెల్పర్లను తొలిదశలో 3నెలల కాలానికి ఆ తర్వాత ఏడాది కాలానికి నియమిస్తున్నారని ఆవిధంగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన నియమించాలన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ వర్కర్లకు నెలకు రూ.6,450 హెల్పర్లకు రూ.4,775 గౌరవవేతనం ఇస్తున్నారని వీటిని ఆశావర్కర్లతో సమానంగా పెంచాలని కోరారు. 2020-21 విద్యాసంవత్సరంలో 53 మంది ఎస్‌సి విద్యార్థులకు మంజూరుచేయాల్సిన పోస్ట్‌మెట్రిక్ స్కాలర్షిప్ ఇంకా చెల్లించలేదని అన్నారు. కోవిడ్ సమయంలో స్కాలరు దరఖాస్తులు ఆన్‌లైన్లో చేసుకున్నారని పలు సాంకేతిక సమస్యలవల్ల వీరికి స్కాలర్షిప్ మంజూరు కాలేదన్నారు. ఈ సమస్యపై ఆది ద్రావిడ సంక్షేమ మంత్రి, కార్యదర్శి, డైరెక్టర్లకు పలుసార్లు విజ్ఞప్తి చేశారన్నారు. ఆశావర్కర్ల జీతం రూ.10వేలకు పెంచుతున్నట్లు సిఎం రంగసామి ప్రకటించారని, వివిధ పాఠశాలల్లో సేవలు అందిస్తున్న మిల్క్ బాయిలర్‌లకు సైతం రూ.18వేల వరకు పెంచుతున్నట్లు ఆయన ప్రకటించడంపై సీఎం రంగసామికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు పెట్టుబడి ప్రోత్సాహకం అందజేత



యానాం వ్యవసాయ, రైతు సంక్షేమం శాఖ ఆధ్వర్యంలో ఆత్మ పథకంలో భాగంగా బుధవారం రైతులకు వరిలో సమగ్ర పోషక యాజమాన్యం అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక యానాం మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించారు. ఈ మేరకు ఆర్ఎఒ మునిస్వామి, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్ గణేషన్‌లు రబీ పంటకు సంబంధించి పెట్టుబడి ప్రోత్సాహకం అందజేశారు. ఎకరాకు జనరల్ కేటగిరికి సంబంధించి 105 మందికి రూ.5 వేలు చొప్పున, ఎస్‌సి కేటగిరికి సంబంధించి 52 మందికి రూ.6వేలు చొప్పున మొత్తంగా రూ.12,20,490 లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో చిక్కాల జోగిరాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జల సంరక్షణ

భూగర్భ జల పెంపునకు ఇంకుడు గుంతలు ఎంతగానో ఉపయోగ పడతాయని నెహ్రూ యువ కేంద్ర సభ్యులు తెలిపారు. క్యాచ్ ది రైన్ శ్రమదాన్ శిబిరం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణ సుధాకర్ ఆధ్వర్యంలో కళాశాల సమీపంలో బుధవారం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. వర్షపు నీరు వృధా పోకుండా నేరుగా ఆరడుగుల ఇంకుడు గుంతలో పడేటట్టు కళాశాల మేడకు పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, లంక ప్రసాదరావు, నారాయణరావు, ఆనంద్ పాల్గొన్నారు.

ముగిసిన ఆపదమిత్ర శిక్షణ

యానాంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణపై ఆపదమిత్ర వాలంటీర్లకు 12 రోజుల శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఇప్పటివరకు శిక్షణ పొందిన వాలంటీర్లకు ఆర్ ఏ ఓ మునిస్వామి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కొలతలు తూనికల శాఖ అధికారి గణేషన్ అధ్యక్షతన ఈ శిక్షణలో జరిగాయి. కార్యక్రమంలో రెవెన్యూ,పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌లో భారీ కుంభకోణం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

బోగస్ హామీలతో యువతను బురిడీకొట్టించి 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ యువత పేరునే ఉపయోగించుకునే భారీ కుంభకోణానికి పాల్పడ్డారని రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బహుళజాతి సంస్థ సీమెన్స్ సంస్థ రూ.3300 కోట్లు గ్రాంటుగా ఇస్తుందనే ఎరవేసి రాష్ట్ర ఖజానా నుంచి రూ.370 కోట్లను అత్యంత లాఘవంగా మింగేశారన్నారు. సీమెన్స్ సంస్థకు భారత విభాగంలో ఉన్నత స్థానాల్లో ఉన్న ఇద్దరు ఉద్యోగుల సహకారంతో, దేశీయంగా ఉన్న మరో రెండు బోగస్ కంపెనీలను కలుపుకుని మొత్తంగా ఈ కుంభకోణాన్ని నడిపించారన్నారు. 2014లో చంద్రబాబు సిఎం అయిన కొద్ది నెలలకే సీమెన్స్ ఇండియా సంస్థకు ఎండీగా వ్యవహరిస్తున్న సౌమ్యాద్రి శేఖర్ బోస్ అలియాస్ సుమన్ బోస్, మరికొందరితో కలిసి యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణను ఇవ్వడానికి ఒక పథకాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ ప్రాజెక్టును అమలుచేయడానికి సుమారు రూ.3,300 కోట్లు ఖర్చవుతుందని, ఇందులో 90 శాతం మొత్తాన్ని సీమెన్స్ సంస్థ గ్రాంటుగా ఇస్తుందని, మిగిలిన మొత్తాన్ని సుమారు రూ.370 కోట్లు (పన్నులతో కలిపి) రాష్ట్ర ప్రభుత్వం వాటాగా చెల్లించాలనేది ప్రతిపాదన అన్నారు. ప్రభుత్వం వెంటనే జిఒ జారీ చేసేసిందన్నారు. ఇఎంఒలు నాటి నుంచే కుంభకోణం ప్రారంభమయ్యిందన్నారు. దారిమళ్లిన ప్రజాధనం వారినుంచి రాబట్టాలని డిమాండ్ చేశారు.

బెడ్, వీల్‌చైర్ల బహూకరణ

ప్రజాశక్తి-మండపేట

స్థానిక ఆలమూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్ రెండు వీల్ ఛైర్లను, ఒక బెడ్ ను బుధవారం బహూకరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమా నందినికి వాటిని అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం వీటిని బహూకరించానని అన్నారు. ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



బెడ్, వీల్ చైర్లు అందజేసిన శ్రీనివాస్

ఆటంకాలు లేకుండా ఇసుక సరఫరా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నాడు-నేడు పనులకు, ఇళల నిర్మాణ పనులకు ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ఇసుక సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ తో కలసి కలెక్టర్ మాధవీలత పాల్గొన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, వచ్చే సమావేశం నాటికి జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఇసుక రీచ్ లకు అనుమతులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కొవ్వూరు డివిజన్ రెండు రీచ్‌లకి అనుమతి వచ్చిందని వాటికి అనుగుణంగా స్థాపన, కార్యకలాపాలను నిర్వహణ చేపట్టాలని అన్నారు. జిల్లాలోని ఏడు రీచ్ లలో 82548 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉన్న ట్లు తెలిపారు. గత సమావేశం సందర్భంగా తీసుకున్న నిర్ణయంపై నివేదిక ఇస్తూ పందల పర్రు, జీడిగుంట, కుమారదేవరం సాండ్ రీచేస్ అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. కడియపులంక కు చెందిన రీచ్ కి ఇ సి ప్రతిపాదనకు పంపించామన్నారు. గతంలో బోట్స్ మ్యాన్ సొసైటీస్ ద్వారా ఆరు సొసైటీస్ లు దరఖాస్తు చేసుకోగా, పుష్కర్ కో ఆపరేటివ్ సొసైటీ కి తప్ప మిగిలిన వాటికి అనుమతులు ఇచ్చామన్నారు. వెలుగుబంద లే అవుట్ వద్ద ఇళ్ళ నిర్మాణానికి అవసరమైన 26 వేల మెట్రిక్ టన్నుల, కొవ్వూరు, అనపర్తి ఇళ్ళ నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ఓపెన్ రీచ్ ల ద్వారా అందుబాటులో ఉంచామని అన్నారు. సమావేశంలో ఏడు బోట్స్ మ్యాన్ సొసైటీలకు చెందిన ప్రతిపాదనలకు అనుమతులు ఇవ్వలేదన్నారు. జిల్లాలో గుర్తించిన 39 సాండ్ రీచ్ లకు చెందిన పూర్తి స్థాయి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. రానున్న వర్షాకాలం నాటికి ఇళ్ళ నిర్మాణాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ముందస్తుగా స్టాక్ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. స్టాక్ యార్డ్‌ల్లో నిలువ ఉంచే ఇసుక నాణ్యతను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిడి మైన్స్ ఇ.నరసింహ రెడ్డి, ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి, అడిషనల్ ఎస్‌పి ఎస్ఇబి ఎమ్.రాంబాబు, ఎస్ఇబి పి.సోమశేఖర్, డిడి గ్రౌండ్ వాటర్ జి.శ్రీనివాస్, డిటిఒ కెవి.కష్ణారావు, పిపిసిబి ఇఇ ఎడి మైన్స్ ఎమ్.సుబ్రహ్మణ్యం, డిఇ ఇరిగేషన్ కాశీ విశ్వేశ్వరరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎఇ జి.కరుణారేఖ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీపై సామాజిక తనిఖీ

ప్రజా ప్రతినిధులు లేకుండా కొనసాగిన సభ

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం మండలంలో గల అన్ని గ్రామాలలో 2022 23 సంవత్సరాలు సంబంధించిన జాతీయ ఉపాధి హామీ పథకం పనుల పై సామాజిక తనిఖీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటలకే అని చెప్పి సాయంత్రం ఐదున్నర గంటలకు సభ ప్రారంభించడంతో ఆయా గ్రామాలలో వచ్చిన ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ అధ్యక్షులు, సర్పంచులు ఉపాధ్యక్షులు సభకు హాజరు కాలేదు. సమయపాలం లేకుండా సభ నిర్వహించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు సామాజిక తనిఖీ ఆయా గ్రామాల పనులపై సమీక్ష ఆవకతవకలు పరిశీలించ వలసి ఉండగా ప్రతి ఏటా ఉదయం నుంచి సాయంత్రం వరకు సభ నిర్వహించి తనిఖీలను పూర్తి చేసేవారు. అయితే ఈసారి సభా సమయాన్ని 2 గంటలకు మార్చి అది కూడా సాయంత్రం ఐదున్నర గంటల వరకు ప్రారంభించకపోవడంతో ప్రజా ప్రతినిధులు ఆగ్రహించి వెళ్లిపోయారు. దీనితో కేవలం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం కొనసాగించారు. ప్రజా ప్రతినిధులు లేకుండా సామాజిక తనిఖీ నిర్వహించడం పై పలువురు విమర్శిస్తున్నారు.



మండల పరిషత్ వద్ద ఏర్పాటు చేసిన సభ